

# బాబాకథలు

_మహర్షి

తులసీదాస్ మహాకవి- హింది భాషలో "రామ చరిత మానస్" అనే మహా కావ్యాన్ని వ్రాశారు. అతను గొప్ప రామభక్తుడు. ఆయన రచించిన కావ్యంలో లంకా పట్టణ వైభవాన్ని వర్ణిస్తూ, లంకలో రాజభవనాలు ఆకాశాన్ని అంటేలా వున్నాయి. ఉద్యాన వనంలోని పూల తోటలన్నీ తెల్లని పుష్పాలతో నిర్మలచిత్తులను నిరూపించేవిలా వున్నాయి అని వ్రాశాడు. రామనామం ఎక్కడ స్మరింపబడుతూ వుంటుందో అక్కడ హనుమంతుడు వుంటాడు. అతను వాయుపుత్రుడు కనుక సర్వత్రా నిండి వుంటాడు. రామనామం జపించే చోట గోచరిస్తు వుంటాడు. తులసీదాసు భక్తులకు లంకాపట్టణ శోభను వర్ణించి చెప్పడం హనుమంతుడు అదృశ్యంగా ఉండి విన్నాడు.

## యద్భావం తద్భవతి

ఒకనాడు తులసీదాస్ వచ్చేటప్పటికి హనుమంతుడు అక్కడకు వచ్చి కూర్చున్నాడు. తులసీదాస్ రాగానే "తులసీదాస్! నీవు వ్రాసిన కవిత్వం తప్పు, లంకలో తెల్లగా పుష్పాలు నేనెక్కడా చూసి వుండలేదు. అన్ని చోట్ల ఎర్రని పుష్పాలనే చూశాను. నీవు లంకకు వెళ్ళి చూడలేదు. నేను స్వయంగా చూశాను కాబట్టి చెబుతున్నాను. నీవు కేవలం వర్ణించి చెబుతున్నావు. అందమైన పదాలతో అబద్ధం చెబుతున్నావు. సత్య వాక్పరిపాలకుడైన రాముని చరిత్రలో అసత్యము వుండటానికి వీలులేదు. ఆ పదాలను నీవు రాసిన దానిలో నుండి తీసెయ్యి" అంటూ చాలాసేపు వాదించాడు.

తులసీదాస్ "సత్యస్వరూపుడైన రామ చంద్రుని చరిత్రలో నేను అసత్యాన్ని చేర్చలేను. నేను వ్రాసినదే సత్యం" అంటూ హనుమంతునితో వాదించాడు. ఇద్దరికీ వాదోపవాదాలు జరుగుతున్నాయి. ఇద్దరి ఆరాధ్య దైవము రాముడే. వీరి వాదన మితిమీరడం వలన శ్రీరాముడు ప్రత్యక్షమై "హనుమంతా! తులసీదాస్ వర్ణించినది పరమ సత్యం" అన్నాడు. అపుడు హనుమంతుడు "నేను లంకలో చూసినది అసత్యమా?" అని ప్రశ్నించాడు. "నీవు రావణునిపై క్రోధము వలన నీ కన్నులు ఎర్రబడి, నీకు లంకలోని తెల్లని పుష్పాలు కూడా ఎర్రగా కనబడ్డాయి. అది నీ దృష్టిదోషమే కానీ మరొక కారణం కాదు" అని చెప్పి అదృశ్యమైపోయాడు.

మనం చూసెడి దృష్టి ఎట్టిదో సృష్టి కూడా అలాగే వుంటుంది. సర్వ మనోభవాలతో నిండి వుండేదే ఈ లోకం అని బాబావారు వివరించారు.

(భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి "చిన్న కథ" జగత్ప్రసిద్ధం. అది అన్ని బాలలవారికీ చిన్న కథే. ఆ చిన్న కథలో ఎన్నో, ఎన్నెన్నో భావార్థాలు గూడార్థాలు నిండి వుంటాయి. వాటిని ఆస్వాదించి ఆనందించండి. భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసాల నుండి స్వీకరించి రచించిన ఆర్. సీతాలక్ష్మిగారి చిన్న కథ ఆధారముతో... మహర్షి.)

జనజీవన స్రవంతిలో నిత్యం ఎదురయ్యే సమస్యలకు.

కల్తీ, అక్రమ వ్యాపార పద్ధతులకు.

ప్రభుత్వ, ప్రైవేట్ సర్వీసుల్లో మోసాలకు.

నష్టపోయిన సందర్భంలో పైసా ఖర్చులేకుండా నష్టపరిహారాన్ని వడ్డీతో సహా చట్టప్రకారం అందించే సలహాలతో 'వినిమయవేదిక' మీకు సహకరిస్తుంది.

# వినిమయ వేదిక

దైనందిన జీవితంలో ఎదుర్కొనే సమస్యల తోరణాలకు పరిష్కారం చూపించే 'మణిమయవేదిక', ఈ 'వినిమయవేదిక'.



ఆంధ్రప్రదేశ్ వినియోగదారుల సంఘాల సమాఖ్య ఛైర్మెన్
మందడి కృష్ణారెడ్డి
నిర్వహించే ఈ శీర్షిక 'మయూరి' పాఠకులకు సగర్వ కానుక.
మీ సమస్యలు, సందేహాలు పంపాల్సిన చిరునామా—
మందడి కృష్ణారెడ్డి,
కన్స్యూమర్స్ అవేర్‌నెస్, రీసెర్చ్ సొసైటీ,
పోస్ట్‌బాక్స్ నెం: 3, ఖైరతాబాద్
(హెచ్.పి.ఓ.)
హైదరాబాదు—500 004.